
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0
5
ANDHRAJYOTHY
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శనివారం 20 సెప్టెంబరు 2025



తహసీల్దార్లు జవాబుదారీగా పనిచేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లు ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అ న్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్డీవో ల తో పాటు 20మండలాల తహసీల్దార్లతో భూభారతి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అసైన్డ్ భూములు, భూదాన్ భూములు పరిరక్షణ, పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదేవిధంగా పట్టణ సమీపంలోని దేశిఇటిక్యాలలో బస్తీ దవాఖానాను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందించే వైద్యసేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రక్తపరీక్ష గదులతో పాటు వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించారు. పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలని రైతులకు న్యాయమైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ మార్కెటింగ్ ప్రణాళిక శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెండు లక్షల 75వేల ఎకరాల్లో పత్తి పంట సాగు జరిగిందని 33 లక్షల క్వింటాళ్ళ కాటన్ దిగుబడి కానున్నట్లు తెలిపారు.



ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

అపార్.. బేజార్

- ముందుకు సాగని విద్యార్థుల జీవితకాల విద్యా గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ
- ఆధార్ కార్డులో దొర్లిన తప్పులే అపార్‌కు తలనొప్పిగా మారిన పరిస్థితి
- అడ్మిషన్ రిజిస్టర్... ఆధార్‌కార్డులలో జనన తేదీల్లో వ్యత్యాసం

గద్వాల సర్కిల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొచ్చింది. అందులో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే ప్రతీ విద్యార్థికి జీవితకాలం 12 అంకెలు గల విద్యా గుర్తింపు కార్డు అందజేసేందుకు ఆధార్ కార్డు మాదిరిగా అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)కార్డుకు శ్రీకారం చుట్టింది. అయితే అపార్ నమోదు ప్రక్రియ జోగులాంబ గద్వాల జిల్లాలో బేజారు వాతావారణాన్ని తలపిస్తోంది. ఆధార్ కార్డులో దొర్లిన తప్పులు అపార్ నమోదుకు ప్రక్రియకు తలనొప్పిగా మారింది. దీంతో ఎంతో ఆర్భాటంగా కేంద్ర ప్రభుత్వం జీవిత కాల విద్యా గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ నత్తనడకగా సాగడంతో విద్యార్థులకు ఇప్పట్లో తిప్పలు తప్పేల లేదు.

జీవితకాలం అమల్లో...

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు విద్యార్థి పొందే అపార్ కార్డు జీవితకాలం అమల్లో ఉంటుంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు విద్యార్థికి సంబంధించిన కుటుంబ వివరాలు, విద్యా పరమైన అంశాలు, ఉపకార వేతనాలు, మెమోలు, విద్యా ధ్రువపత్రాలు, చదివే సమయంలో సాధించిన విజయాలు ఆధార్ కార్డు అనుసంధానంతో ఉంటాయి. పోటీ పరీక్షలలో, ఉద్యోగ సమయాల్లో ఈ అపార్ కార్డు సంఖ్య ఉపయోగపడడంతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హులైన విద్యార్థులకు సక్రమంగా అమలయ్యేందుకు అపార్ కార్డు ప్రామాణికంగా మారింది.

ఆధార్, అడ్మిషన్ రిజిష్టర్లలో దొర్లిన తప్పులతో సమస్య

ప్రధానంగా ఆధార్ కార్డు నమోదుతో పాటు విద్యార్థుల అడ్మిషన్ రిజిష్టర్లలో నమోదు చేసిన వ్యక్తిగత వివరాలు నమోదు సమయంలో దొర్లిన తప్పులు అపార్ కార్డు నమోదు ప్రక్రియకు సమస్యగా మారింది. అపార్ కార్డు పొందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తప్పని సరి. అయినప్పటికీ ఆధార్ కార్డులో విద్యార్థి, వారి తల్లిదండ్రులు పేర్లు, అక్షర దోషాలు, పుట్టిన తేదీలలో తేడాలుండడంతో అపార్ పొందాలంటే అష్టకష్టాలను ఎదుర్కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

చాలా మంది విద్యార్థుల పుట్టిన తేదీలు లేకుండానే ఆధార్ కార్డులుండడం, మరి కొందరివి ఆధార్, అడ్మిషన్ రిజిష్టర్‌లో నమోదైన వివరాలలో తేడాలుండడంతో నమోదు ప్రక్రియకు అడ్డంకిగా మారాయి.



డీఈవో, ఎంఈవోలతో సమావేశమైన ఆర్జేడీ విజయ లక్ష్మి (ఫైల్)

జిల్లాలో 1.20 లక్షలకు పైగా విద్యార్థులు

జోగులాంబ గద్వాల జిల్లాల్లో 652 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. అందులో 474 ప్రభుత్వ, 178 ప్రభుత్వ వివిధ మేనేజ్‌మెంట్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 1,21,111 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో 72,347 మంది విద్యార్థులుండగా అపార్‌లో 48.49 శాతంతో 33,905 మంది విద్యార్థుల వివరాలు జనరేట్ అయ్యాయి. ప్రైవేట్ సంస్థలలో 48,764 మంది విద్యార్థులుండగా వారిలో 45.68 శాతంతో 21,268 మంది విద్యార్థుల వివరాలు జనరేట్ అయ్యాయి.

100 శాతం ప్రయత్నం చేస్తున్నాం



జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ నెంబర్ జనరేట్‌కు చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు 50శాతం వరకు అపార్ జనరేట్ చేశాం. ఆధార్, అడ్మిషన్ రిజిష్టర్‌లో ఉన్న సమస్యల వల్ల అపార్ జనరేట్ కాస్తా ఆలస్యమవుతోంది. ఆధార్ కార్డు అప్డేట్ కొరకు పాఠశాలల్లో ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ తరఫున 25 పోర్టబుల్ ఆధార్ కిట్లను ప్రయార్టీ బేస్‌లో పంపడం జరిగింది. ఈ నెలాఖరు వరకు తప్పకుండా 100 శాతం అపార్ ప్రక్రియను పూర్తి చేస్తాం.

- శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి

పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో పత్తికొనుగోళ్ల పారదర్శకంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అవసరం మేరకు గద్వాలలో రెండు, అలంపూర్‌లో ఒకటి చెప్పున మొత్తం మూడు పత్తికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్టోబరు మాసం చివరి వారం నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పత్తి తేమశాతం 8 వరకు ఉండాలని, పత్తి కొనుగోలుకు కిసాన్ యాప్ డౌన్‌లోన్ చేసుకొని రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా వ్యవసాయ విస్తీర్ణాధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ యాప్ ద్వారానే రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలన్నా రు. జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, వ్యవసాయ అధికారి సంగీతలక్ష్మి, సీసీఐ అసిస్టెంట్ దిలీప్, అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

రంగులు మార్చిన ఆకాశం

క్లిక్.. క్లిక్..



సంధ్యవేళ పసుపు రంగులో కనిపిస్తున్న ఆకాశం

పొద్దు వాలుతున్న వేళ.. సూరీడు కొండల చాటుకు తప్పుకుంటున్న సమయం.. నీలి ఆకాశం పసుపు వర్ణాన్ని పులుముకున్నది. చీకట్లు ముసురుకుంటున్న వేళ గులాబీ వర్ణాన్ని సంతరించుకున్నది. అప్పుడే వెలిగిన వీధి దీపాలకు కొత్త రంగులద్దింది. అచ్చంపేట పట్టణంలో శుక్రవారం సాయంత్రం కనిపించడంతో 'ఆంధ్రజ్యోతి' క్లిక్కుమనిపించింది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



చీకటి పడుతుండగా గులాబీ వర్ణంలో..

కొత్తపల్లి-జూరాల మధ్యనే బ్రిడ్జి నిర్మించాలి

- గద్వాలలో కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా
- నిర్మించే వరకు పోరాటం ఆగదని తేల్చిన ప్రజలు

గద్వాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం కొత్తపల్లి-జూరాల గ్రామాల మధ్యనే నిర్మించాలని కోరుతూ... కొత్తపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి, చెనుగోనిపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 500మంది ప్రజలు కిష్టారెడ్డి బంగ్లా నుంచి ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌక్ మీదుగా వైఎస్సార్ చౌక్‌కు చేరుకున్న తర్వాత రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహిమతుల్లా మాట్లాడుతూ కొంతమంది రాజకీయం చేయడం ద్వారా మా గ్రామాలు తీవ్రంగా అన్యాయానికి గురయ్యాయని వివరించారు. 1975లో జూరాల-కొత్తపల్లి మధ్య డ్యామ్ వస్తే దానిని 17 కిలోమీటర్ల పైకి కట్టారని వివరించారు. పేరు జూరాలది ప్రయోజనాలు పొందింది మాత్రం అక్కడ ఉన్న గ్రామాలని వివరించారు. 1964లో నేషనల్ హైవే కూడా కొత్తపల్లి మీదుగా ప్రతిపాదన అయితే దానిని కూడా బీచుపల్లికి మార్చారని గుర్తు చేశారు. కృష్ణానదిపై కొత్తపల్లి వద్ద బ్రిడ్జిని నిర్మిస్తే గద్వాల- ఆత్మకూర్‌ల మధ్య దూరం 9కిలోమీటర్లు ఉంటుందని వివరించారు. ప్రాజెక్టు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే 30కిలో మీటర్లు అవుతుందని వివరించారు. హైదరాబాద్‌కు దాదాపు 30కిలో మీటర్ల దూరం తగ్గి గంట సమయం ఆదా అవుతుందన్నారు.

అనంతరం కలెక్టరేట్‌కు తరలివెళ్లి ఏఓకు వినతి పత్రం అందించారు. ఈ ర్యాలీలో ఆత్మకూర్ బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు తమ్మలి విజయ్, బీఆర్ఎస్ నాయకుడు హసీమ్, గుంటిపల్లి మాజీ సర్పంచు మన్నెస్వామి, మాజీ ఎంపీటీసీ శివకుమార్, నాయకులు హనుమంత్‌రెడ్డి, చెనుగోనిపల్లి సురేష్, తెలుగు అంజి, శ్రీరామ్‌రెడ్డి, పరశు, మనోహర్, శంకర్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి-జూరాల మధ్యనే బ్రిడ్జి నిర్మించాలని ర్యాలీ నిర్వహిస్తున్న ఐదు గ్రామాల ప్రజలు, నాయకులు

రేవులపల్లి వద్దే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరిన సరిత

గద్వాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) కృష్ణానదిపై రేవులపల్లి వద్దనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సోమవారం సరిత హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. రేవులపల్లితో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలు భూములు, ఇళ్లను కోల్పోయారని, ఇప్పుడు అక్కడ పర్యాటక కేంద్రం ఏర్పాటు చేశారని బ్రిడ్జి నిర్మాణం చేస్తే అన్ని గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆమె విన్నవించారు. అదేవిధంగా ధరూర్, కేటీదొడ్డి, గట్టు మండలాలతో పాటు రాయచూర్‌కు రవాణా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఇందుకు ఇరిగేషన్ మంత్రి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట నాయకులు డీఆర్ శ్రీధర్, ఆంజనేయులు, పోస్టు వెంకటయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, రాజు, గోపి, చంద్రన్న, కిష్టన్న, సుధాకర్, గజేంద్ర, అంజన్ కుమార్, శ్రీను, సతీష్ ఉన్నారు.



మంత్రి ఉత్తమ్‌ని కలిసి వినతి పత్రం అందిస్తున్న సరిత

ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేవాళ్లం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

అచ్చంపేట సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేవాళ్లమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2సంవత్సరాలు పూర్తయినా రాష్ట్రంలోని ప్రాజెక్టులలో తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. పక్క రాష్ట్రంలో ఆల్మటి డ్యాం ఎత్తు 219 మీటర్లు ఉన్న దాన్ని 225 మీటర్ల ఎత్తుకు పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం రూ.70వేల కోట్లు కేటాయించి సిద్ధం చేసుకుంటున్నదన్నారు. దీనిద్వారా మొదటగా నష్టపోయే రాష్ట్రం తెలంగాణ అయినప్పటికీ నోరు మెదుపడంలేదన్నారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని కౌన్సిలర్ రమేష్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లమల బిడ్డనైతే కొండగల్‌లో మాత్రం ప్రాజెక్టులు ప్రారంభం చేస్తున్నారు కానీ, అచ్చంపేట పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ నెల 28న కేటీఆర్ అచ్చంపేట పర్యటన ఉన్నందున నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలోని సభాస్థలిని వారు పరిశీలించారు. మునిసిపల్ మాజీ చైర్మన్లు నర్సింహగౌడ్, తులసీరాం, కౌన్సిలర్లు అంతటి శివ, నాయకులు కర్ణాకర్‌రావు, గణేష్, అమీనొద్దీన్, తిరుపతయ్య పాల్గొన్నారు.



కేటీఆర్ రాక కోసం సభా స్థలాన్ని పరిశీలించి చర్చిస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

కృష్ణానది నీరు సముద్రం పాలు

» బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ 7

అడవిలో చెంచు మహిళ మృతదేహం

- వదిలేసి వెళ్లిపోయిన 108 సిబ్బంది 7
- ఆటోలో ఈర్లపెంటకు తరలింపు

నేడు అలంపూర్ ఆలయాల శుద్ధి

- 22 నుంచి దసరా ఉత్సవాలు 7

రైస్ డెలివరీలను ఎఫ్‌సీఐకి అప్పగించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వనపర్తి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ 2024-25 ధాన్యం సేకరణ - కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలను నిర్ణీత గడువులో ఎఫ్‌సీఐకి అప్పగించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి జిల్లాలోని చిట్యాల గ్రామ పరిధిలోని లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్, సురక్ష రైస్ మిల్లును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలను వేగవంతం చేయాలని ఆయన మిల్లర్లకు సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీ అనేది ఒక కీలకమైన దశ అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా బియ్యాన్ని ఎఫ్.సి.ఐ గోదాములకు తరలించాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, మిల్లింగ్ సామర్థ్యం, ఇప్పటివరకు డెలివరీ చేసిన బియ్యం వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ డిప్యూటీ మేనేజర్ జగన్ మోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ సైతం పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్, సురక్ష రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్

జలాశయం నిర్మాణానికి రైతులు సహకరించాలి

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి ముంపు బాధిత రైతులు సహకరించాలని నీటి పారుదల శాఖ ఈఈ మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రబీ సీజన్ నాటికి సాగునీరు అందించడమే లక్ష్యంగా జలాశయం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. గణప సముద్రం జలాశయం పునరుద్ధరణ పనుల కోసం 603 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. అందులో ఇప్పటికే భూ సేకరణలో భాగంగా 388.03 ఎకరాలకు సంబంధించి రైతులు స్వచ్ఛందంగా అంగీకార పత్రాలు అందజేశారన్నారు. ఎకరాకు రూ.12.60 లక్షల చొప్పున త్వరలోనే ప్రభుత్వం ద్వారా భూ పరిహారం చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. చెరువు కట్ట (బండ్) పునర్నిర్మాణం డౌన్ స్ట్రీమ్ భాగం కోసం సేకరించిన భూమి 18 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవెల్) పరిధిలో గల మరో 197 ఎకరాల భూ సేకరణకు సంబంధించి సర్వే పూర్తయిందని, సంబంధిత రైతులు భూ సేకరణకు సహకరించాలని కోరారు. ముంపు బాధిత రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సమస్యలను ఎమ్మెల్యే మేఘారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

అగ్రరాజ్యంలో భారతీయుల ప్రాణాలకు రక్షణలేదు

- ప్రజా సంఘాల నాయకుల విమర్శ
- బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతున్న నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో భారతీయుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజా సంఘాల నాయకులు ఎం.రాఘవాచారి, ఎస్.ఎం ఖలీల్, వామన్ ఖమార్, నిజాముద్దీన్, హనీఫ్‌అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 4వ తేదీన అమెరికాలోని కాలిఫోర్నియాలో జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్ హస్మద్దీన్ కుమారుడు నిజాముద్దీన్(29) పోలీసు కాల్పుల్లో మరణించారని సోషల్ మీడియా ద్వారా తెలిసిందన్నారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. కుమారుడు చనిపోయినట్లు వార్తలు రావటంతో తండ్రి ఆవేదన మాటల్లో చెప్పలేమన్నారు. చనిపోయిన యువకుడి కుటుంబానికి సమాచారం ఇవ్వటంలో అక్కడి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. భారత ఎంబసీ ఒక భారతీయుడు చనిపోయినా పట్టించుకోకపోవటం వారి పనివిధానానికి నిదర్శనమన్నారు. అమెరికాలో ఎన్నారైలు అనేక సంస్థలు నడుపుతున్నారని కాని భారత్ నుంచి వెళ్లిన శ్రామికుల గురించి మాట్లాడే సంస్థలు కరువయ్యాయన్నారు. కేవలం రాజకీయ నాయకులు, ప్రముఖులను సన్మానాలు చేయడానికే పరిమితమయ్యాయని విమర్శించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమెరికాలో భారతీయులపై వివక్ష కొనసాగుతోందన్నారు.

దిగువ జూరాలలో నిలిచిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ద్వారా భారీ స్థాయిలో వరద కొనసాగుతున్న సందర్భంగా దిగువ జూరాల కేంద్రంలో విద్యుదుత్పత్తి నిలిచిపోయిందని ఎస్ఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 3.738 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటి వరకు 345.828 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గురువారం రాత్రి నుంచి ఉదయం వరకు 3.811 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 37.154 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. నది ద్వారా వరద ఉధృతి పెరగడంతో దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి ఉత్పత్తిని నిలిపివేశామని ఆయన పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి నిహారిక



చట్టాల గురించి వివరిస్తున్న జడ్చర్ల జూనియర్ న్యాయాధికారి నిహారిక

జడ్చర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి నిహారిక సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని నెక్కొండ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన లోక్ అదాలత్, సైబర్‌క్రైమ్, పోక్సో చట్టంపై నిర్వహించిన న్యాయవిజ్ఞాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. దేశంలోని మారుమూల గ్రామాలలోని అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన ఉంటేనే బాధ్యతాయుతమైన పౌరులుగా మారగలుగుతామన్నారు. హక్కులు మాత్రమే కాకుండా కర్తవ్యాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్ షాకీర్, న్యాయవాదులు విశ్వేశ్వర్, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, సాహి తిరెడ్డి, పురుషోత్తం, పాండు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన

కొల్లాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ టాస్క్ అకాడమీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ)పై శుక్రవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎన్ ఉదయ్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మాస్టర్ ట్రైనర్ అజయ్ రెడ్డి విద్యార్థులకు ఏఐ యొక్క ప్రాముఖ్యత, వినియోగాలు, భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలపై వివరించారు. కృత్రిమ మేధస్సు అనేది భవిష్యత్ ప్రపంచానికి ప్రధాన సాంకేతిక శక్తి అవుతుందని, ఏఐ ఆధారిత నైపుణ్యాలు నేర్చుకున్న విద్యార్థులు పరిశ్రమల్లో, పరిశోధనలో, సేవా రంగాలలో అగ్రగాములుగా ఎదగవచ్చన్నారు. ప్రత్యేకంగా స్థానిక మహాదేవి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇరు కళాశాలల విద్యార్థులు అనేక సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

పాన్‌గల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు పోరుబాట పట్టారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రధాన రహదారిపై దాదాపు గంట సేపు రైతులు రాస్తారోకో చేపట్టారు. వీరికి బీఆర్ఎస్, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. యూరియా సరఫరా చేసే వరకు ఆందోళన విరమించేదేలేదని రైతులు భీష్మించి కూర్చున్నారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు తిప్పేస్వామి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి డాకేశ్వర్, సింగిల్‌విండో సీఈవో భాస్కర్‌గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతులు ససేమిరా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం సింగిల్ విండో కార్యాలయం వద్ద రోజు పడిగాపులు కాస్తున్నామని, సరిపడా పంపిణీ చేయకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. యూరియా లేక తమ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరసాగర్, సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఆరోపించారు. కార్యక్రమంలో దేవేందర్, వెంకటయ్య నాయుడు, బాలస్వామి, బాలరాజుగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ సేవలకు ఆటంకం



మన్ననూరు పీహెచ్‌సీలో ఆయుష్ ఆసుపత్రి



గదిలో ఆయుర్వేదిక్ మందులు

- 20 ఏళ్లుగా సొంత భవనం కరువు
- పీహెచ్‌సీలో ఇరుకైన గదిలో నిర్వహణ
- గిరిజన, చెంచు పెంటలకు అందని వైద్యం

మన్ననూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతంలోని చెంచులకు ఆయుర్వేద వైద్యం అందించాలనే సంకల్పంతో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయుష్(ఆయుర్వేద డిస్పెన్సరీ) ఆసుపత్రికి సొంత భవనం లేక సేవలకు అసౌకర్యంగా మారింది. 20 ఏళ్లుగా భవనం లేకపోవడంతో ఇతర శాఖలకు చెందిన భవనాల్లోనే ఆసుపత్రి నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడింది. మన్ననూరులోని పాత పీహెచ్‌సీ భవనం వద్ద కొత్త భవనాన్ని నిర్మించుకునేందుకు గత ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరవ్వగా, అధికారులు నిధులను అలోపతిక్ డిపార్టుమెంట్‌కు ఖర్చు పెట్టుకున్నారు. మళ్లీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉండగా కార్యరూపం దాల్చడం లేదు.

దవాఖానను అభివృద్ధి చేస్తే ప్రయోజనం

అలోపతిక్ వైద్యంలో తగ్గని దీర్ఘకాలిక, ఇతర వ్యాధులకు ఆయుర్వేదిక్ మందులు ఉపయోగకరంగా ఉంటాయి. మధుమేహం, చర్మవ్యాధులు, దగ్గు, జలుబు ఇతర వ్యాధులకు అనేక రకాల మందులున్నాయి. వీటిని వైద్యుల సూచన మేరకు వాడితే రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మన్ననూరు పీహెచ్‌సీ భవనంలో ఓ చిన్న గదిలో ఆయుర్వేదిక్ ఆసుపత్రికి కేటాయించగా రోగులకు సౌకర్యంగా లేదు. ఆసుపత్రిలో ఒక రెగ్యులర్ డాక్టర్, స్వీపర్ పని చేస్తున్నారు. మరో డాక్టర్‌తో పాటు ఫార్మాసిస్టు, కాంపౌండర్, అటెండర్, ఒక ప్రత్యేక వాహనం అవసరం ఉంది. ఈ ఆసుపత్రి ద్వారా మారుమూల గ్రామాలకు, పెంటలకు సైతం వెళ్లి సంచార వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. ఆయుర్వేదిక్ వైద్యశాలను అన్ని హంగులతో అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం



ఆయుర్వేద వైద్యశాలకు ప్రత్యేక భవనం లేక పీహెచ్‌సీలో ఇరుకైన గదిలో ఇబ్బందిగా సేవలందిస్తున్నాం. ప్రత్యేక భవన నిర్మాణం కోసం ఏళ్లుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా. గతంలో నిధులు మంజూరైనా వినియోగించకపోవడంతో భవన నిర్మాణం కాలేదు. మళ్లీ నిధుల మంజూరీకి ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- పానుగంటి జాన్సన్, ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యాధికారి

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- 8 గేట్లు ఎత్తి 2.96 లక్షల క్యూసెక్కులు విడుదల

గద్వాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు భీమానది ఉప్పొంగి జూరాల వద్ద కృష్ణానదిలో కలుస్తోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 2.96 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. దీంతో ప్రాజెక్టు ఎనిమిది గేట్లను తెరిచి 2,22,400 క్యూసెక్కులను, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,961 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 211.95 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20 వేల క్యూసెక్కులను అవుట్‌ఫ్లో ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 30 వేల ఇన్‌ఫ్లో ఉండగా, గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 32 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమానది నుంచి సన్నతి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 3 లక్షలు, అవుట్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు ఉన్నది. ప్రస్తుతం జూరాలకు 2.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 27 గేట్లను ఎత్తి 1.82 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,540 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 18వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో సెంట్రల్ లైబ్రరీ సమీపంలో ఏడు రోజుల స్పెషల్ క్యాంపు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సేవ చేయడం గొప్ప అవకాశమన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మిగతా విద్యార్థుల కంటే చురుకుగా క్యాంపులో పాల్గొనాలని సూచించారు. అనంతరం వలంటీర్లతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి, ఎన్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, చీఫ్ వార్డెన్ కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 ఆఫీసర్ గాలన్న, అర్జున్ కుమార్, రాఘవేందర్, శివకుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల క్యాలెండర్ విడుదల



యూనివర్సిటీ పరిసరాలను శుభ్రం చేస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్,రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు, విద్యార్థులు

యూనివర్సిటీ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో 2025-26 సంవత్సరంలో జరిగే క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు ఆవిష్కరించారు. 25 విభాగాలలో నైపుణ్యత కలిగిన విద్యార్థులను పారదర్శకంగా ఎన్నుకోని యూనివర్సిటీకి మంచిపేరు తీసుకురావాలని, చదువుతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

అభివృద్ధి కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తా..

- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



పరిసరాలను శుభ్రం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లెందుకు ఎన్నిసార్లు అయినా ఢిల్లీకి వెళ్తానని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వలపట్ల కాలనీలో మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని బీజేపీ చేపట్టిన సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. అచ్చంపేటను అన్ని విధాల కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు మాట్లాడుతానని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగరవేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి, మంగ్యానాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, రేణయ్య, కాత్రావత్ జ్యోతి, ఆంజనేయులు, శివచంద్ర, చందులాల్ చౌహాన్, దేవేందర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యపూర్‌లో ఫిల్టర్ ఇసుక దందా



మద్యలవాగులో ఫిల్టర్ ఇసుక డంపులు

- ఉదయం ట్రాక్టర్లతో డంపులు
- రాత్రికి టిప్పర్లతో రవాణా

కోయిలకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్ మద్యలవాగులో కొన్ని రోజుల ఫిల్టర్ ఇసుక దందా జోరుగా కొనసాగుతుంది. ఉదయం మద్యలవాగులోని పరిసరాల నుంచి మట్టితో కలిసిన ఇసుకను వాగు పైకి తెచ్చి డంపులు పోసి రాత్రిళ్ల టిప్పర్లతో జిల్లా కేంద్రం తోపాటు ఇతర ప్రాంతాలకు అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. వాగు ఇరువైపుల నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు ఆచార్యపూర్ మద్యలవాగుల నుంచి టిప్పర్లతో ఇసుక దందా ప్రారంభం అవుతుంది.

అండగా పోలీసులు, అధికారులు

మూడు ముప్పులు ఆరు కాయలుగా కొనసాగుతన్న ఫిల్టర్ ఇసుక దందాను నడిపే ఓ వ్యక్తి పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయని బాహాటంగానే చెబుతున్నాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు ఒక్క వాహనం పట్టుకొని కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు.

ఫిల్టర్ ఇసుక డంపులు సీజ్ చేస్తాం..



మండలంలోని ఆచార్యపూర్ వాగు వెంట ఉన్న ఫిల్టర్ ఇసుక డంపులను సీజ్ చేస్తాం. ప్రభుత్వ అనుమతి ఉంటేనే ఇసుకను తరలించాలని.. అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు తప్పవు. ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు చేసి డంపులను స్వాధీనం చేసుకుంటాం.

- రాజా గణేశ్, తహసీల్దార్, కోయిలకొండ

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ పోటీలు

- ప్రారంభించిన డీవైఎస్ఓ వెంకటేశ్‌శెట్టి



క్రీడాపోటీల ప్రారంభంలో పాల్గొన్న డీవైఎస్ఓ, ఉపాధ్యాయులు

ఊట్కూర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-17 బాల బాలికల క్రీడాపోటీలను డీవైఎస్ఓ వెంకటేశ్ శెట్టి, ఎంఈవో మాధవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో రాణించిన వారికి దేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం జరిగిన ఆటపోటీల్లో వాలీబాల్ బాలికల విభాగంలో ఊట్కూర్ బాలికల ఉన్నత పాఠశాల విజేతగా నిలువగా, రన్నరప్‌గా చిన్నపొర్ల విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ బాలుర విభాగంలో పులిమామిడి పాఠశాల విద్యార్థులు విజేతగా నిలువగా, రన్నరప్‌గా చిన్నపొర్ల పాఠశాల విద్యార్థులు నిలిచారు. ఖోఖో బాలుర విభాగంలో పులిమామిడి పాఠశాల విద్యార్థులు విజేతగా నిలువగా, రన్నరప్‌గా ఊట్కూర్ బాలుర పాఠశాల విద్యార్థులు నిలిచారు. ఖోఖో బాలికల విభాగంలో టీజీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు విజేతలు కాగా, పులిమామిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో ఊట్కూర్ గురుకుల విద్యార్థులు విజేతలుగా నిలువగా ఊట్కూర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. కబడ్డీ బాలుర విభాగంలో ఊట్కూర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేత కాగా, రన్నరప్‌గా చిన్నపొర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. సాయంత్రం గెలుపొందిన విద్యార్థులకు డీవైఎస్ఓ, ఎంఈఓ, రిటైర్డు జీహెచ్ఎం భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం సత్యనారాయణ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీలు సాయినాథ్, రాజశేఖర్, మౌలాలి, పారిజాత, జగదీశ్‌గౌడ్, తిరుమలేశ్, లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌కు ఎంపికైన జిల్లా విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు జుల్ఫికర్, హఫ్సా, ఆయేషా, ఫహద్, గుల్‌ఫిషా, మహ్మద్ అజహర్, ఖీద్ర, హజీఫ్ షరీఫ్ ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జహంగీర్‌పాష ఖాద్రీ విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో శనివారం నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలి

- ఆర్ఎల్‌సీ ఖాజా బహోద్దీన్



ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఎంపికైన మైనార్టీ గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ గురుకులాల రీజినల్ లెవెల్ కో ఆర్డినేటర్ ఖాజా బహోద్దీన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఖోఖోలో ఆరుగురు, వాలీబాల్‌లో ఇద్దరు , కబడ్డీకి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకుల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికావాలన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు శివకుమార్



విద్యార్థి శివకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, అధ్యాపకులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి శివకుమార్ జాతీయ స్థాయి ఎన్‌సీసీ పోటీలకు ఎంపికయ్యారు. బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ చదువుతున్నాడు. శుక్రవారం ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, అధ్యాపకులు అతన్ని ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ త్వరలో గుజరాత్‌లో జరుగనున్న ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే జాతీయ స్థాయి పోటీలకు కళాశాల విద్యార్థి ఎంపిక కాడవం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ఉమాదేవి, అధ్యాపకులు అంజయ్య, వనిత, కోదండరాములు, రామకృష్ణ దశరథం, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బతుకమ్మ సంబురాలు



మానవపాడు కస్తూర్బా పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

మానవపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఉంచి పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. ఎస్‌వో జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ సెమినార్‌లో విద్యార్థి ప్రతిభ

వనపర్తి విద్యావిభాగం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ సెమినార్ 2025లో వనపర్తి జిల్లా పెద్దమందడి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సుర భవ్య రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభను చాటింది. క్వాంటుం ఏజ్ బిగిన్స్ పోటెంటిల్స్ అండ్ ఛాలెంజస్ అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సెమినార్‌లో ప్రశంసాపత్రం అందుకుంది. భవ్యకు మార్గదర్శకుడిగా ఉన్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సాయిచందర్‌రెడ్డిని, విద్యార్థిని శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ప్రశంసించారు.

క్రైం కార్నర్

లారీ, ద్విచక్ర వాహనం ఢీ యువకుడి మృతి

జడ్చర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల ఆర్ అండ్ బీ అతిథిగృహం సమీపంలో, జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ మండలం పెద్దబాయితండాకు చెందిన సాలావత్ రాజేశ్ (22) 20 రోజుల క్రితం అనంతపురం జిల్లాలోని ధర్మవరం గ్రామానికి వెళ్లాడు. గురువారం రాత్రి జడ్చర్లకు చేరుకున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఇండికేటర్స్ కూడా వెయ్యకుండా హఠాత్తుగా సెడన్‌బ్రేక్ వేశాడు. దాని వెనుకే బైక్‌పై వస్తున్న రాజేశ్ లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోగా, అప్పటికే రాజేశ్ మృతి చెందాడు. కాగా అతడి వద్ద లభించిన రూ.47,930ను 108 సిబ్బంది పోలీసుల సమక్షంలో బాధిత కుటుంబసభ్యులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. సంఘటనపై రాజేశ్ తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో.. ఎనిమిది మందికి గాయాలు

మక్తల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన సందీప్, వంశీ, శివ, ఉదయ్‌లు రెండు రోజుల క్రితం కొక్కి సుబ్రహ్మణ్యస్వామి సుబ్రమణ్యస్వామి దర్శనానికి బయలుదేరారు. దైవ దర్శనం అనంతరం శుక్రవారం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని చందాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఉన్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. శివ, ఉదయ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. సందీప్, వంశీలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించారు. అలాగే మాగనూరు మండలం వడ్వాట్‌కు చెందిన ఆటో ప్రయాణికులతో మక్తల్‌కు వస్తుండగా దాసర్‌దొడ్డి శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అమ్మపల్లి రేణుక, వడ్వాట్ తాయమ్మ, చాంద్‌బీ, అడవి సత్యవార్ జయంతిలకు గాయాలయ్యాయిన సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

వంగూరు/ వెల్దండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డ్రైంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. వంగూరు, వెల్దండ ఎస్‌ఐలు మహేశ్‌గౌడ్, కురుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమన్‌గల్ మండలంలోని మేడిగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ సేవ్యానాయక్ ఏప్రిల్ 4న మద్యం తాగి వాహనం నడుపుతూ శ్రీశైలం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీను ఈనెల 18న డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డాడు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. వారిలో సేవ్యానాయక్‌కు 2 రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా, శ్రీనుకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి జాడ కావ్య తీర్పు వెల్లడించారు.

కబేళాకు తరలిస్తున్న ఆవుల పట్టివేత



పట్టుబడిన కంటైనర్, నిందితులతో సీఐ నాగార్జున, సిబ్బంది

ఊర్కొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు తరలిస్తున్న ఆవులు, కోడె దూడలను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. కల్వకుర్తి సీఐ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతీపురం నుంచి కంటైనర్ లారీలో 25 ఆవులు, 46 కోడెదూడలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ శివారులో కంటైనర్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులోని పశువుల్లో కొన్నింటికి గాయాలు కావడంతో మండల పశువైద్యాధికారి రాజేశ్‌ను పిలిపించి, చికిత్స చేయించారు. అనంతరం పశువులను కల్వకుర్తి మండలంలోని రాచూర్‌లో ఉన్న గోశాలకు పంపించారు. కంటైనర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించారు. కంటైనర్ డ్రైవర్, హర్యానకు చెందిన శకీల్, సహాయకులు ఆంధ్రప్రదేశ్‌లోని నక్కపల్లికి చెందిన దుర్గా, లవరాజు, అప్పలరాజులను అరెస్టు చేశారు. వాటిని కొనుగోలు చేసిన రహీమొద్దీన్, హైదరాబాద్‌లో దిగుమతి చేసుకునే వ్యక్తి మదార్, మధ్యవర్తి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. సంఘనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చిన్నచింతకుంట ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని తిరుమలాపూర్ గ్రామ శివారులో ఊకచెట్టు వాగు నుంచి శుక్రవారం ఎండీ అనిష్ అనే వ్యక్తి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను కౌంకుంట్ల తహసీల్దార్‌కు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

నవాబ్‌పేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన దూళ్ల రాములు అనే వ్యక్తి అదృశ్యం అయ్యారు. ఆయన కుమారుడు శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దూళ్ల రాములు ఈనెల 14 నవాబ్‌పేటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు శ్రీనివాస్ గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

అత్తింటి వారి వేధింపులు

» పోలీసులకు మహిళ ఫిర్యాదు

లింగాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళను మానసికంగా, శారీరకంగా వేధించిన అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు లింగాల ఎస్‌ఐ వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని చెన్నంపల్లికి చెందిన బండారి నాగమణిని కొంత కాలంగా భర్త రామకృష్ణ, అత్త చెన్నమ్మ, అడపడుచు శారదా అనసూయలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఈనెల ఆరవ తేదీన ఆమెపై కర్రలతో దాడి చేయడంతో నాగమణి గాయపడింది. ఈ విషయంపై బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

లింగాల, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ గేదె చనిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల గ్రామ శివారులో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన చెంచేటి పద్మకు తన పొలంలో గేదెను కట్టేసి ఇంటికి వెళ్లింది. అది తాడును తెంచుకొని మేత మేసుకుంటూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లింది. అక్కడున్న ఎర్త్‌వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి

» జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ » నారాయణపేట, కోస్గి, మద్దూరులలో పర్యటన



మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

నారాయణపేట/ కోస్గి/ మద్దూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన నారాయణపేటలోని ఎస్పీ కార్యాలయం, కోస్గి సర్కిల్ ఆఫీస్, మద్దూరు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ముందుగా కోస్గి సర్కిల్ కార్యాలయంలో పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మద్దూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు, ఎస్పీ యోగేష్ గౌతమ్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ ఎస్పీ ప్రధాన కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎస్‌బీ, డీసీఆర్‌బీ, హెడ్ క్వాటర్స్, అడ్మిన్ స్టోర్, ఆయుధాలు, హోమ్‌గార్డ్, డాగ్‌స్క్వాడ్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం నారాయణపేట సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయాల రికార్డులను ఎస్పీతో కలిసి తనిఖీ చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, సిబ్బంది పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. వాటిని క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. తనిఖీల్లో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు శివశంకర్, సైదులు, రామ్‌లాల్, రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు బాలరాజు, విజయ్ కుమార్, రాముడు, నరేష్, పురుషోత్తం, సునీత తదితరులు పాల్గొన్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

» నారాయణపేట గురుకుల పాఠశాల ముందు కాంగ్రెస్ నాయకుల ఆందోళన



గురుకుల పాఠశాల ముందు బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొటోకాల్ పాటించకుండా, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాధికారి గోవిందురాజులుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపేట పట్టణంలోని గురుకుల పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి బోధనా భ్యసన సామగ్రి (టీఎల్ఎం) మేళా నిర్వహించారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి సమాచారం ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో పాఠశాల ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డీఈవో వచ్చి వివరణ ఇవ్వాలని, ఆ తర్వాతే మేళాను ప్రారంభించాలని పట్టుబట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు డీఈవో గోవిందరాజులు పాఠశాలకు వచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యేకు ఫోన్ చేసి క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీంతో డీఈవో ఫోన్ చేయగా, ఆమె లిఫ్ట్ చేయలేదు. ఆ తర్వాత నాయకులకే క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీసీ బాల్‌రాజుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వమనోజ్, విండో డైరెక్టర్ మల్లేశ్, పోషల్ రాజేశ్, సునీల్, యూసుఫ్‌తాజ్, వెంకుగౌడ్, అఖిలేశ్వర్‌రెడ్డి, బండి ఆనంద్, అనిల్, పవన్, మనోజ్, వినోద్, రవిగౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో రమేశ్‌బాబు

రాష్ట్ర స్థాయి టీఎల్ఎం మేళాకు ఇద్దరు ఉపాధ్యాయులు

బిజినేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బోధనా భ్యసన సామగ్రి ప్రదర్శన (టీఎల్ఎం మేళా)కు నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈవో రఘునందన్‌శర్మ తెలిపారు. కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, గౌరారంలోని ప్రాథమిక పాఠశాలలో పరిసరాల విజ్ఞానం ఉపాధ్యాయుడు వేణు జిల్లా స్థాయి టీఎంఎల్ మేళాలో పాల్గొన్న ప్రథమ బహుమతి అందుకొని, రాష్ట్ర స్థాయి మేళాకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని డీఈఓ రమేశ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు దెంది రాజారెడ్డి, రామకృష్ణలు వారిని ఘనంగా సన్మానించి అభినందించారు.

అడవిలో చెంచు మహిళ మృతదేహం

» వదిలేసి వెళ్లిపోయిన 108 సిబ్బంది » ఆటోలో ఈర్లపెంటకు తరలింపు

మన్ననూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన ఓ చెంచు మహిళ మృతదేహాన్ని 108 అంబులెన్స్ సిబ్బంది మార్గంమధ్యలో, అడవిలోనే వదిలేసి వెళ్లిపోయారు. ఈ అమానవీయ ఘటన నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండలంలోని పర్హాబాద్ చౌరస్తా సమీపంలో శుక్రవారం వేకువజామున జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగాల మండల పరిధిలోని నల్లమల లోతట్టు ప్రాంతంలోని ఈర్లపెంటకు చెందిన మండ్లి గురువమ్మ(29) 10 రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. భర్త, కుమార్తెలు ఆమె మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి స్వగ్రామం ఈర్లపెంటకు తీసుకెళ్లేందుకు 108 అంబులెన్సులో బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నల్లమల అడవిలోని పర్హాబాద్ చౌరస్తా వద్ద గురవమ్మ మృతదేహంతో పాటు, వెంట ఉన్న కుటుంబ సభ్యులను వదిలేసి 108 సిబ్బంది వెళ్లిపోయారు.

స్వగ్రామానికి చేరక ముందే మధ్యలోనే మృతదేహాన్ని వదిలేసి వెళ్ల డంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఈ విషయంపై ఐటీడీఏ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు చేసేదేమీ లేక శుక్రవారం ఉదయం ఓ ప్రైవేటు ఆటోలో గురువమ్మ మృతదేహాన్ని ఈర్లపెంటకు తరలించామని చెంచులు తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

ఎండీ జాఫర్ హుసేన్, ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ : అనారోగ్యానికి గురైన మండ్లి గురువమ్మను ఐటీడీఏ ద్వారా మేమే జిల్లా ఆసుపత్రిలో చేర్పించాం. ఈర్లపెంటకు అంబులెన్సు వెళ్లేందుకు రోడ్డు బాగోలేదని, బాధిత కుటుంబ సభ్యుల సూచన మేరకు ఆటోలో వెళతామంటే పర్హాబాద్ చౌరస్తాలో వదిలేశామని 108 సిబ్బంది చెప్పారు. ఐటీడీఏ ఖర్చులతోనే మృతదేహాన్ని ఆటోలో తరలించాం. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించాం. మృతదేహాన్ని మధ్యలోనే వదిలిపెట్టి వెళ్లిపోయిన 108 సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

కృష్ణానది నీరు సముద్రం పాలు

» బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ » సింగోటం - గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనుల పరిశీలన



సింగోటం శ్రీవారి సముద్రాన్ని పరిశీలిస్తున్న రాచాల యుగంధర్ గౌడ్

కొల్లాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధుల అసమర్థతతో కృష్ణానది నీరు ప్రతీ ఏడాది సముద్రం పాలవుతోందని తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని బొల్లారం, వల్లభాపురం, సంగినేనిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటిం చారు. సింగోటం - గోపల్‌దిన్నె రిజర్వాయర్ లింక్ కెనాల్ పనులను పరిశీలించారు. అనంతరం కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణానది నీరు సముద్రం పాలవుతుంటే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజా ప్రతినిధులు వేడుక చూస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. జూపల్లి కృష్ణారావు అప్పుడు ఎమ్మెల్యేగా, ఇప్పుడు మంత్రిగా ఉండి సింగోటం లింక్ పనులను పూర్తి చేయించకపోవడం బాధాకరమన్నారు.

సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అరవిందా చారి, నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్ గౌడ్, నాయ కులు వీవీ గౌడ్, సంపత్‌కుమార్, బత్తుల జితేందర్, అంజన్న యాదవ్, మహేందర్ నా యుడు, దేవర శివ, రాఘవేందర్ గౌడ్, నాగ రాజు, నరేందర్ సాగర్, గౌతమ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దుర్భాషలు

» సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

» కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

మహమ్మదాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీ కార్యదర్శిపై ఓ కాంగ్రెస్ నాయకుడు దుర్భాషలాడారు. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల పరిధిలోని కంచిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అక్బర్‌ల మధ్య కొన్ని రోజులుగా గొడవ జరుగుతోంది. అలాగే గురువారం సాయంత్రం మరోసారి వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఇందిర మ్మ ఇళ్ల బిల్లులు, ఇతర పనులు ఎలా చేస్తున్నావు? మా పార్టీ అధి కారంలో ఉం ది? ఇంటికి పంపిస్తా? అంటూ దుర్భాషలాడాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తనపై ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి చేశాడని, విధులకు ఆటంకం కలిగించాడని కార్యదర్శి నాగేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి ఫిర్యాదుపై పోలీసులు గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా తాను కార్యదర్శిపై దాడి చేయలేదని, అతడే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని అక్బర్ తెలిపారు.

కీమోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

» జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర



కీమోథెరపీ సేవలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : జనరల్ ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేర్ సెంటర్‌లో కీమోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర కోరారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని క్యాన్సర్ కేర్ సెంటర్‌లో కీమోథెరపీ సేవలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ జిల్లాకు ఒక క్యాన్సర్ కేర్ సెంటర్‌ను మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదట మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రారంభించి, కీమోథెరపీ సేవలను అందించడం గర్వంగా ఉందన్నారు. మొదటి రోజు తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామానికి చెందిన రాములయ్య, కౌకుంట్ల మండలం పేరూరు గ్రామానికి చెందిన బాలస్వామిలకు కీమోథెరపి చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజు 3 నుంచి 5 మందికి ప్యాలియేటివ్ సేవలను కూడా అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆంకాలజిస్టును, హైదరాబాద్ ఎంఎన్‌జే ఆసుపత్రి నుంచి కూడా ఒక ప్రొఫెసర్‌ను కూడా నియమించిందన్నారు. క్యాన్సర్ కీమోథెరపీ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేకుండా జిల్లాలోనే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అమరావతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలశ్రీనివాస్, ఆంకాలజిస్టు డాక్టర్ రాహుల్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ గౌస్ మోహినుద్దిన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునిల్‌కుమార్, ఏడీ డాక్టర్ ప్రేరణ, ఆర్ఎంవోలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అలంపూర్ ఆలయాల శుద్ధి

» 22 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



జోగుళాంబ ఆలయం

అలంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయాలను శనివారం శుద్ధి చేయనున్నట్లు ఈవో దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, అందుకోసం ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ఆలయాన్ని మూసివేయనున్నట్లు తెలిపారు. ఆలయాల శుద్ధి, పవిత్రోత్సవం నిర్వహిస్తారని అనంతరం 6:30 గంటలకు మహా మంగళహారతి ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులకు అనుమతి ఇవ్వనున్నట్లు వివరించారు.

కమ్యూనిస్టుల ఐక్యతే సురవరం శ్వాస


» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి



సభలో మాట్లాడుతున్న పల్లా వెంకట్ రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి తుది శ్వాస వరకు కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి రక్షగా ఉద్ఘాటించారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి అన్నా రు. జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన సుర వరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. సురవరం సుధాకర్ రెడ్డి అంతరాలు లేని సమ సమాజ నిర్మాణం కావాలని ఆకాంక్షించేవారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్ నరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సురవరం కపిల్, హెచ్ ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, కేశవ్ గౌడ్, ఈర్ల చంద్రమౌళి, కొమ్ము భరత్, ఈర్ల భూపేశ్ కృష్ణాజీ, కందికొండ గీత తదితరులు పాల్గొన్నారు.

పైమీదికి దేవుడు వచ్చాడంటూ.. బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



చిన్న గిడ్డన్న (ఫైల్)

ఉండవల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'పైమీదికి దేవుడు వచ్చాడు' అంటూ ఓ వృద్ధుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడులో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ చిన్న చిన్నయ్య అలియాస్ చిన్న గిడ్డన్న (62) గురువారం రాత్రి మద్యం తాగి తన పైమీదికి దేవుడు వచ్చాడంటూ బావి వద్దకు పరుగులుతీశాడు. పక్కనే ఉన్న గ్రామానికి చెందిన బోయ వేణుగోపాల్ అతడిని నిలువరించేందుకు ప్రయత్నించినా వినకుండా బావిలో దూకాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతడిని బావిలో నుంచి వెలికి తీయగా, అప్పటికే మృతి చెందాడు. సంఘటనపై అతడి కుమారుడు బోయ పరశురాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

సబ్సిడీ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- దీప్తి, మండల వ్యవసాయ అధికారి



ఊర్కొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పనిముట్లను చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం పెద్దకారు రైతులకు 40శాతం సబ్సిడీపై అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవ సాయ అధికారి దీప్తి అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

రైతులకు ఎలాంటి పరికరాలు అందిస్తున్నారు ?

బ్యాటరీలు, చేతి పంపులు 50, అందులో జనరల్- 37, ఎస్సీ-8, ఎస్టీ-5, పవర్ ఆపరేటెడ్ సయేర్స్-7 కాగా అందులో జనరల్-5, ఎస్సీ -2, రోటవేటర్స్-3 కాగా అందులో జనరల్-3, కల్టివేటర్, కేజ్ వీల్స్, డిస్క్ హ్యారో, ఎంబీప్లై-3 కాగా అందులో జనరల్-2 ఎస్టీ-1, పవర్ వీడర్-1 జనరల్, బ్రష్ కట్టర్-1 జనరల్, మేజ్ షెల్లర్-1 జనరల్‌లకు అందిస్తున్నాము.

దరఖాస్తు విధానం ఏమిటీ ?

రోటవేటర్స్, కల్టివేటర్, ఎంబీప్లగ్, కేజ్ వీల్స్ కావాల్సిన రైతులు ట్రాక్టర్ ఆర్సీ రైతు పేరున ఉండాలి. అదేవిధంగా అప్లికేషన్ ఫామ్, రెండు పాస్‌ఫొటోలు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులు, ట్రాక్టర్ ఆర్సీ ధ్రువపత్రం మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులకు అందజేయాలి

ఎప్పటివరకు దరఖాస్తు చేసుకోవాలి ?

ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. 20వ తేదీ తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఎంపికైన లబ్ధిదారులు సంబంధిత పరికరం సరఫరా చేసే కంపెనీ పేర డీడీ తీయాల్సి ఉంటుంది.

న్యూస్ బాక్స్

వైద్యశిబిరం విజయవంతం

వెల్దండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెల్దండ పీహెచ్‌సీలో శుక్రవారం స్వస్థనారీ సుశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి వైద్యులు సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సింధు, మోతీలాల్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆజాద్, మురళీకృష్ణ, కవిత, శ్రీనివాస్, లక్ష్మణ్, గోవర్ధన్, జహంగీర్‌బీ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచమ్మగడ్డతండా గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండాకు చెందిన జర్పుల వసంతకు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన రూ.22,500 చెక్కును ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

వెల్దండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్ర గ్రామం నుంచి శ్రీశైలం బైపాస్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో ఇటీవల బీజేపీ నాయకులు ప్రజావాణిలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం పంచాయతీరాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలించారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జూలూరి బాలస్వామి, పరమేష్, లాలుప్రసాద్, బాలరాజు, చందు, శివ, జంగయ్య, శ్రీశైలం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

అంబులెన్సులో ప్రసవం

వంగూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన విజయకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది శ్రీశైలం, మౌనిక, ప్రతిమలు ఆమెకు ప్రసవం చేశారు. తల్లీబిడ్డక్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పరశురాముడు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎత్తం పరశురాముడు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి ఆడెపు నాగార్జున, మద్దిలేటి ఆదేశానుసారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఇన్‌చార్జ్ చెల్లెపాటి రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యకర్తల సూచనల మేరకు ఎత్తం పరశురాముడును ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కదిరెపాడు నరసింహ, ఉపాధ్యక్షునిగా పడాల శ్రీనివాసులు, కోశాధికారిగా బొల్లె శ్రీనివాసులు, కార్యదర్శిగా నల్లవాల బాలు, గౌరవ సలహాదారుగా జగన్మోహన్, కార్యవర్గ సభ్యులుగా మాసయ్య, చంద్రశేఖర్, నల్లవాల మద్దిలేటి, మీడియా ఇన్‌చార్జ్‌గా కడ్తాల అర్జున్ నియమితులయ్యారు. ఈ నెల 22న కొల్లాపూర్‌లో జరగనున్న మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రకుల పేదల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

కంపుకొడుతున్న మల్లంకుంట

- ముక్కు మూసుకుంటేనే వెళ్లేది !

- ముళ్లపొదలు, వ్యర్థాలతో నిండిన చెరువు

- ఆహ్లాదం కోసం వెళితే దుర్వాసన



దుర్గంధం వస్తుండడంతో ముక్కు మూసుకొని వెళ్తున్న మహిళ



కంప చెట్లతో నిండి పోయిన మల్లంకుంట చెరువు

అచ్చంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని మల్లంకుంట చెరువు నుంచి దుర్గంధం వెదజల్లుతుంది. ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని కలిగించేందుకు మల్లంకుంట ఆధు నీకరించి కట్టను విస్తరించి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంలో రూ.2.5కోట్ల నిధులు మంజూర య్యాయి. అందులో కోటీ 30లక్షల ఖర్చు చేసి ఇరువైపులా కంచె ఏర్పాటుతో పాటు కట్టపై 385 మీటర్ల సీసీ రోడ్డును ఏర్పాటు చేసి వదిలేశారు. దాదాపు ఆరు ఎకరాల శిఖం భూమిలో రెండు ఎకరాలకు పైగా అన్యాక్రాంతమవడంతో మల్లంకుంట చెరువు నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. నాగర్ కర్నూల్-శ్రీశైలం ప్రధాన రహదారి సమీపంలో చెరువు ఉండటంతో అభివృద్ధి పరిస్తే పర్యాటకు లు దండిగా వచ్చే అవకాశాలు లేకపోలేదు.



చెరువు కట్ట పొడవునా ఇలా చెత్త..

వ్యర్థాలతో కంపు..

పట్టణంలోని వ్యర్థాలు, మురుగు నీరు మల్లంకుంటలోకి మళ్లిస్తుండటంతో చెరువులో దుర్గంధం తాండవిస్తోంది. చెరువులో కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. చేపలు, మటన్ మార్కెట్ వ్యర్థాలు యథేచ్ఛగా చెరువులో పారబోస్తున్నారు. దీంతో చెరువులోని నీళ్లు రంగుమారి కంపుకొడుతున్నాయి. కూరగాయల మార్కెట్ నుంచి సాయి నగర్ కట్టమీదుగా వెళ్లాలంటేనే కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. ముక్కుమూ యంది కట్టమీదుగా వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా మల్లంకుంట చెరువును ఆధునీకరించి ఉపయోగంలోకి తీసుకరావాలని పట్టణ ప్రజలు కోరు తున్నారు

నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక

అర్ధంతరంగా మల్లంకుంట చెరువు అభివృద్ధి నిలిచిపోవడంతో మరో రూ.2 కోట్ల పనులకు ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపారు. కట్టపై 15 నుంచి 30 అడుగుల సీసీరోడ్డు నిర్మాణం, సెంటర్‌లైటింగ్ ఏర్పాటు, చెరువులో వ్యర్థాలను తొలగించడం, పార్క్ ఏర్పాటుతో పాటుకు ఈ నిధులు మంజూరైతే ఖర్చు చేయనున్నారు.

వ్యర్థాలు పోయకుండా చూడాలి



మల్లంకుట చెరువును అభివృద్ధి పరిచి పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని అన్నారే తప్ప, ఏమీ చేయడం లేదు. పట్టణంలోని వ్యర్థాలను మల్లంకుంట చెరువులోనే పోస్తున్నారు. ఇక్కడంగా వెళ్లాలంటే దుర్వాసనతో పోలేకపోతున్నాం. చెరువులో పెరిగిన చెట్లను తీసేసి మురుగు నీరు రాకుండా చేయాలి.

- శ్రీనివాసులు, స్థానికుడు అచ్చం పేట

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- డీఈవో రమేష్ కుమార్



కస్తూర్బా ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్ డేను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డీఈవో రమేష్

కల్వకుర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలను కల్వకుర్తి ఎంఈవో శంకర్ నాయక్‌తో కలిసి డీఈవో ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ గురుకులాలు, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 950 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొని ఎంపికైన క్రీడాకారులకు ఎంఈవో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జీహెచ్‌ఎంలు, ఏఈడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ఇంటర్ విద్య : డీఈవో

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యను అందించాలన్నదే రాష్ట్రప్రభుత్వ ముఖ్య లక్ష్యమని డీఈవో రమేష్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన (వెల్కమ్ ఫ్రెషర్స్ డే) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి, ఎంఈవో శంకర్ నాయక్, కేజీబీవీ ప్రిన్సిపాల్. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

వెల్దండ : సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్‌కుమార్ అన్నారు. అక్షర ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వీవోఏలు, వెలుగు మహిళా సంఘాల సీసీలకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో డీఈవో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వయంసహాయక సంఘాలలో గుర్తించిన నిరక్షరాస్యులకు విద్యను అందించడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రుడునాయక్, ఏపీఎం శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఆర్పీలు రాఘవేందర్, రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- ప్రిన్సిపాల్ గోపాల్‌రావు



వెల్దండ : సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

వెల్దండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు ఆకాంక్షించారు. శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించి, నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఎంతో శ్రమకోర్చి విద్యాలయాలకు పంపిస్తారని, వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ముందుకుసాగాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు శివప్రసాద్, విజయలక్ష్మి, ప్రవీణ, రమేష్, సుమలత, చిదానందం, పర్వతాలు తదితరులు ఉన్నారు.

అలంపూర్ జోగుళాంబ దేవి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆహ్వాన పత్రం ఇస్తున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఆలయ ఈవో దీప్తి

అచ్చంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే అలంపూర్ జోగులాంబ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆలయ కమిటీ ఈవో దీప్తిలు శుక్రవారం హైదరాబాద్ తన నివాసంలో కలిసి ఆహ్వానించారు. దసరా ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానించామన్నారు.

జీపీవోలు క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలి

తాడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా విధుల్లో చేరినటు వంటి గ్రామ పరిపాలనా అధికారులందరు క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి నిరంతరం కృషి చేసి ఎలాంటి భూ తగాదాలు లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ప్రభుత్వం నూతనంగా నియమించిన 10మంది జీపీవోలు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ జయంతి మాట్లాడుతూ 24 గ్రామ పంచాయతీలకు గాను 10 రెవెన్యూ క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టరుకు ఒక్కో జీపీవోను నియమించినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలకు ఇకపై రెవెన్యూపరమైన చిన్న చిన్న సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం అవుతాయి అని అన్నారు. కార్యక్రమంలో డీటీ మహమూద్ అలీ, జీపీవోలు ఉన్నారు.

పిల్లలు ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి

తెలకపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) బాలబాలికలు ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్‌ఆర్య అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా ఛైర్మన్, కార్యదర్శి ఆదేశాల మేరకు చైల్డ్‌ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి అవగాహన కల్పించడానికి లీగల్ సర్వీసెస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేజీబీవీలో అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీరామ్ ఆర్య మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్‌వాడకంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. బాలికలకు ఏవిధమైన సమస్యలున్నా షీటీంకు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి లబ్ధి పొందాలని సూచించారు. హెచ్‌ఎం మసీనా, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- బీజేపీ నాయకుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి



ఊర్కొండలో రక్తదానం చేస్తున్న యువకులు

ఊర్కొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ నాయకుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు పురస్కరించు కొని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, బండెల రామచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, సందీప్‌కుమార్, కొమ్ము శ్రీను, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మన్ననూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రెండువారాలకోసారి పెంటల్లోనిర్వహించే పీఎం జన్మన్ సంచార వైద్య శిబిరాలను చెంచులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌పాల్ నాయక్ తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలోని మల్లాపూర్ పెంటలో శుక్రవారం సంచార వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా, డెంగీ, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలిచ్చారు. వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తాజాగా వండిన ఆహారాన్ని, కాచి వడపోసిన నీటిని తాగాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు కావ్య, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఆరోగ్య సహాయకులు ఆంజనేయులు, స్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఐతోల్, భలాన్‌పల్లి, లచ్చిరాంతండా, సిర్సవాడ, పాపగల్, గోవిందాయపల్లి, ఎట్టిధార్ పల్లి, అంతారం, చెన్నోళ్ల కాలనీ, గుంతకోడూరు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



స్ప్రింక్లర్లను రైతులకు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కల్లు సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కడారి వెంకటయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నారాయణ్ నర్సింహారెడ్డి అన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో 60 శాతం సబ్సిడీతో మంజూరైన స్ప్రింక్లర్ పైపులను శుక్రవారం మండలంలోని సిరసనగండ్లలో 19 మంది రైతులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులను ఏ మాత్రమూ పట్టించుకోలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలను ఇవ్వకుండా పూర్తిగా ఎత్తివేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో మహేశ్వరి, సందీప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సద్దాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పగడాల వెంకటయ్య, రామస్వామి పాల్గొన్నారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- అదనపు కలెక్టర్ అమరేందర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ సూచించారు. కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరు మండలాలకు సంబంధిం చిన నూతనంగా విధులకు హాజరైన గ్రామ పంచాయతీ అధికారులకు పెద్దకొత్తపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం జరిగింది. కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్‌తో కలిసి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు చేయాల్సిన పనుల గురించి వివరించారు. పెద్దకొత్తపల్లి మండల సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా గురించి వారు వివరించారు. వారికి సకాలంలో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని వారు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అంజనేయులు, సర్వేర్లు లైసెన్సు సర్వేలందరూ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- న్యాయవాదుల నిరసన



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొల్లాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాది సాయికుమార్‌తో పాటు ఇతర న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం కొల్లాపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, నజీరొద్దీన్, చిన్న కురుమయ్య, శ్రీహరి, మనోహర్, మధుసూదన్‌రావు, మోహన్‌లాల్, బాలస్వామి, రామలక్ష్మమ్మ, రాఘవేంద్ర, రాజు, మల్లయ్య, నాగరాజు, ముబీన్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

దాడికి ఖండన

కల్వకుర్తి : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయవాదులపై కక్షిదారులు దాడి చేసి, తీవ్రంగా గాయపర్చడం హేయమైన చర్య అని కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జే నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలో నిరసన చేపట్టారు. న్యాయవాదులు వెంకట్‌గౌడ్, లక్ష్మీనారాయణ, ఎస్‌మల్లేష్, కే వెంకటరమణ, ఏరామ్, గోపాల్, జంగయ్య, నాగరాజు, శివకుమార్, నాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

అచ్చంపేటలో అయోధ్య శ్రీరామ రథం ఊరేగింపు



అయోధ్య శ్రీరామ రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అచ్చంపేటటౌన్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎకల్ శ్రీహరి సత్సంగ సమితి ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ రథానికి స్వాగతం పలుకుతూ అచ్చంపేట పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాస్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి మాట్లాడుతూ నిరుపేద భక్తుల దగ్గరకు భగవంతుని దర్శనం అందించాలనే ఉద్దేశ్యంతో దేశంలో మొత్తం 108 రథాలు తిరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా తెలంగాణలో రెండు రథాలు తిరుగుతున్నాయన్నారు. నల్గొండ జిల్లాలో పర్యటించి, డిండి మీదుగా శుక్రవారం అచ్చంపేటకు రాగా, మహిళల కోలాటాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంభాగ్ గౌరవాధ్యక్షుడు వీరబొమ్మ లక్ష్మీనరసింహ, మహిళా సమితి అధ్యక్షులు డాక్టర్ ఇంద్రాదేవి, సంభాగ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే లక్ష్యం చేరుతాం

-కెరీర్ గైడెన్స్ కౌన్సెలర్ రమావత్ రవి

బిజినేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళికతో చదివితే నిర్దేశించుకున్న లక్ష్యం చేరుతారని కెరీర్ గైడెన్స్ కౌన్సెలర్, దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రభుత్వ ఎస్వీ సైన్స్ అండ్ ఆర్ట్స్ అటానమస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కెరీర్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థిదశలో ఎంత క్రమశిక్షణ పాటిస్తే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. చాలా మంది చెడు వ్యసనాలకు, సెల్‌ఫోన్లకు లోనై విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు, లైబ్రేరియన్ డాక్టర్ వర్కాల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, అధ్యాపకులు నాగరాజు, శివ, ప్రవళిక, కురుమయ్య తదితరులు ఉన్నారు.

ఉల్లాస్ మాడ్యూల్స్‌పై శిక్షణ

తెలకపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వయోజన విద్యాకార్యక్రమం ఉల్లాస్ మాడ్యూల్స్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో వాలంటీర్‌ను గుర్తించినట్లు తెలిపారు. ప్రతీ వాలంటీర్ పది మంది నిరక్ష్యరాశులకు చదువు నేర్పించాలని అన్నారు. ప్రతీ శనివారం గ్రామపంచాయతీ లేవల్‌లో వాలింటర్‌కు శిక్షణ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శేఖర్, జీహెచ్‌ఎం శోభన్‌బాబు, ఎస్‌వో జగదీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేష్, ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.

నవ భారత్ సాక్షరతపై శిక్షణ

లింగాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నవ భారత్ సాక్షరతా (ఉల్లాస్)పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో బషీర్‌అహ్మద్ మాట్లాడుతూ అక్షర వికాసం, మాడ్యూల్ బోధించాల్సిన విధానాన్ని శిక్షణకు హాజరైన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు బాలుఅజయ్, శివప్రసాద్, వీవోటీలు, బీవోఎల్, వీవోఏలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఐకేపీ సీసీలు శంకర్ లాల్, లక్ష్మీకాంత్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

వయోజనులను విద్యావంతులు చేయాలి : ఎంఈవో

తిమ్మాజిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 15ఏళ్ల పైబడిన వయోజన మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో సత్యనారాయణశెట్టి సూచించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఉపాధ్యాయుడికి వీవోఏలకు ఉల్లాస్‌పై డీఆర్పీ నిరంజన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు నిరంజన్ శిక్షణ ఇచ్చారు.

బీకేతిర్మలాపూర్‌లో వైద్య శిబిరం

అమ్రాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామస్థులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయగా 110మంది హాజరయ్యారు. ఓరల్ క్యాన్సర్, గర్భాశయ సమస్యలతో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స నిర్వహించి అవసరమైన వారిని ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి వైద్యాధికారి డాక్టర్ విష్ణు వ్యాధులబారిన పడకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పదర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విష్ణు, వైద్య సిబ్బంది అంజమ్మ, రెడ్యానాయక్, మురళీధర్‌రావు, మాధవాచారి, మల్లయ్య, బిచ్చులు, కృష్ణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చుతాం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ



వావిళ్లబాయిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వావిళ్లబాయి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని ప్రతీ నిరుపేదలకు ఇల్లు కట్టించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.సత్యం, విష్ణు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగబాబు, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, ఆ గ్రామ కాంగ్రెస్‌ప ఆర్టీ అధ్యక్షులు ములకపల్లి రామస్వామి, నాయకులు బారీ వాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.